ప్రచురణ తేదీ : 05-22-2019 రచయిత పేజీని సమర్పించినవారు:______

# చింతపెంట సత్యనారాయణరావు

## సి.యస్.రావు

కథలు

సామాజిక స్పృహతో కథలు రాసే కొద్దిమంది మంచి రచయితలలో శ్రీ సి.యస్.రావు గారు ముఖ్యులు. రచనకు జీవితానుభవం ఆలంబన అనే విషయాన్ని ఎవరూ కాదనలేరు. శ్రీ సియస్‌రావు గారి కథలు జీవితానికి దగ్గరగా వుండటం కాదు– అవి జీవిత వాస్తవాలనుంచే పుట్టాయి. ప్రతి వూరికీ, పట్టణానికీ, రాష్ట్రానికీ, దేశానికీ సరిహద్దులూ, చుట్టుకొలతలూ వున్నట్లు ప్రతి రచయితకూ మానసికమైన పరిమితులతో పాటు, భౌగోళికమైన పరిధులు కూడా వుంటాయి. శ్రీ సి.యస్.రావు గారు తూర్పు గోదావరి జిల్లా మనిషి. గోదావరి వరద పొంగు ఆయన కథల్లో కనిపిస్తుంది.

ఈ సంకలనంలోని కథలన్నీ గోదావరి జిల్లా వూపిరి పోసుకుని జీవిస్తాయి. శ్రీ సి.యస్.రావు గారికి ఆ ప్రాంతం ప్రజల జీవితం గురించి క్షుణ్ణంగా తెలుసు. అంతకంటే, ఆయనకు భాషమీద కల అధికారం అపారం. ఆయన కథన శక్తి కంటే లక్ష్యశుద్ధి, సాంఘిక న్యాయం కొరకు పోరాడడం పట్ల ఆయనకు గల ప్రగాఢమైన వాంఛ ఆయన కథల్లో ప్రత్యక్షరమందునా ప్రత్యక్షంగా ద్యోతకమవుతుంది.

సూక్ష్మంగా పరిశీలిస్తే – అన్ని కథలలోనూ, 'డికెన్సు'– 'జే జనరేషన్' పట్ల రచయిత పడిన మథన, సరిదిద్దాలనే ఆశయం, పోరాటం, తిరుగుబాటు తప్ప వ్యవస్థను మార్చలేమనే సత్యాన్ని గొంతెత్తి చెప్పాలనే ఆరాటం కనిపిస్తాయి. 'నా కథలు కాలక్షేపం కోసం రాసినవి కావని' ఆయన మనస్సు విప్పి చెప్తున్నారు. ఒక లక్ష్యం, ఒక ప్రయోజనం కొరకై వ్రాసినవని అర్థం. 'ఏ లక్ష్యం? ఏ ప్రయోజనం?' అని అడిగేవారికి ఈ సంకలనంలోని (31) కథలు గుండెమీద గుద్ది జవాబిస్తాయి.

**'మల్లెమొగ్గ'** కథలో పువ్వులను కూలికి కోసి నాలుగు డబ్బులు సంపాదించే మధ్యతరగతి పేదింటి కన్నెపిల్లల గాథ కరుణరసాత్మకంగా చెప్పారు రచయిత. ఇందులో అభాగ్య–సీత అనుకుంటుంది– 'నేను పువ్వుల్లో పుట్టాను. పువ్వుల మధ్య పెరిగాను. తిరిగాను, రోజూ పువ్వులు కోసాను. అందుకే పూలకికూడా నే వెగటై పోయాను' – ఇది ఫ్రస్ట్రేషన్. ఈ నిరాశలోంచే అన్యాయాలను దహించే నిప్పురవ్వలు జనిస్తాయి. **'రాజనీతి'** కథలో చదువుకున్న తరం భూకామందుల కొత్తరకం దోపిడీ విధానాలను బట్టబయలుచేస్తూ– శత్రువుల స్ట్రాటజీని పేదప్రజలు గ్రహించవలసి వుంటుందని సూచించారు.

మొత్తానికి ఈ సంకలనంలోని కథలన్నీ నిప్పురవ్వలు. రచయిత ప్రేలనున్న ఒక అగ్నిపర్వతం మీద కూర్చుని రాసిన కథలివి. ఇవన్నీ రచయిత జీవిత ప్రవాహంలో, అనుభవంలో కలిగిన వివిధ సన్నివేశాలకు ఈ కథలు పునాదులు.

పుటలు: 252 పేపర్ బ్యాక్